




‘పవన’మెటు



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీపై తీవ్ర ఉత్కంఠ
- ఏ స్థానం నుంచి పోటీ చేస్తారనేదానిపై విస్తృత చర్చ
- కాకినాడ ఎంపీ, పిఠాపురం అసెంబ్లీ సీట్లలో ఏదనేదానిపై రకరకాల ఊహాగానాలు
- టీడీపీ, బీజేపీ సూచనలతో ఎంపీగా బరిలోకి దిగి కేంద్ర మంత్రిగా వెళ్తారంటూ టాక్
- భవిష్యత్తులో కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టేలా కీలకపాత్ర పోషిస్తారంటూ చర్చ
- మరోపక్క పిఠాపురం నుంచే అసెంబ్లీ బరిలో ఉంటారంటూ జనసేనలో చర్చోపచర్చలు
- అటు పవన్ పిఠాపురం నుంచి మొగ్గు చూపుతారన్న అంచనాలతో వైసీపీ అప్రమత్తం
- దొంగఓట్ల దగ్గర నుంచి అనుకూల అధికారుల నియామకం వరకు ముందస్తు‘ప్లాన్’

త్వరలో జరగనున్న ఎన్నికల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జిల్లాలో ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేదానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పోటీ చేసేది కాకినాడ జిల్లా అని ఇప్పటికే స్పష్టమైనా అయితే ఎంపీగానా.. ఎమ్మెల్యేగానా అనేదానిపై మాత్రం విస్తృత చర్చ జరుగుతోంది. ఇప్పుడు జిల్లాలో ఎక్కడచూసినా పవన్ పోటీ ఎక్కడనేదే హాట్‌టాపిక్‌గా మారింది. ఇంతకాలం పవన్ పిఠాపురం నుంచి పోటీ చేయడం ఖాయ మని బలంగా చర్చ జరిగింది. కానీ గడచిన కొన్ని రోజులుగా పవన్ కాకినాడ ఎంపీ సీటు నుంచే బరిలోకి దిగుతారనే ఊహాగానాలు అధికమయ్యాయి. ప్రధానంగా బీజేపీతో పొత్తు ఖరారైన తర్వాత ఈ చర్చ మరింత ఎక్కువగా జరుగుతోంది. ఎన్డీఏలో చేరినందున ఎంపీగా పోటీ చేసి ఆ తర్వాత కేంద్రమంత్రిగా అయితే అన్ని విధాలా బాగుంటుందని టీడీపీ, బీజేపీల నుంచి ప్రతిపాదనలు వచ్చాయనే ప్రచారం బలంగా ఉంది. అయితే కేంద్రంలోకి వెళ్తే పార్టీని నడిపించడం కష్టం కాబట్టి పిఠాపురం నుంచే బరిలోకి దిగితేనే అనువుగా ఉంటుందనే చర్చ జనసేనలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏ స్థానం నుంచి పవన్ నిలబడతారనేది అన్ని పార్టీల్లోను ఆసక్తిగా మారింది. మరోపక్క పవన్ పిఠాపురం నుంచి బరిలోకి దిగుతారనే ప్రచారం నేపథ్యంలో అధికార వైసీపీ అప్పుడే తెరవెనుక ఎత్తులు, జిత్తులు మొదలుపెట్టింది.

త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బలమైన ముద్ర వేయాలని జనసేన పట్టుదలగా ఉంది. తమ పార్టీకి బాగా పట్టున్న జిల్లాగా భావిస్తుండడంతో ఎక్కువ స్థానాలను ఇక్కడే కోరుతోంది. అందులోభాగంగా టీడీపీతో పొత్తులో భాగంగా ఇప్పటికే పలు కీలక నియోజకవర్గాలను దక్కించుకుంది. అటు అధికార వైసీపీకి జిల్లాలో ఒక్క సీటు కూడా రాకుండా చూసుకునే బాధ్యత తాను తీసుకుంటున్నట్టు ఇప్పటికే పవన్ ప్రకటించారు. ఈనేపథ్యంలో జనసేనాని రాజకీయ వ్యూహం అధికార వైసీపీలో వణుకు పుట్టిస్తోంది. మరోపక్క ఈ ఎన్నికల్లో కాకినాడ జిల్లా నుంచే బరిలోకి దిగాలని పవన్ నిర్ణయించుకోవడం వైసీపీకి నిద్రలేకుండా చేస్తోంది. గత ఎన్నికల్లో గాజువాక, భీమవరం నుంచి పోటీచేసిన పవన్ ఈ దఫా వాటిలో ఏదొక స్థానం నుంచి బరిలోకి దిగవచ్చని ఇంతకాలం అంచనా వేసింది. కానీ పవన్ అడుగులు కాకినాడ జిల్లా వైపు పడ్డంతో వైసీపీకి వెన్నులో వణుకు పుడుతోంది. అయితే జిల్లాలో ఏ స్థానం నుంచి బరిలోకి దిగుతారనేది ఊహకందక ఎత్తులుపైఎత్తులు ఎలా వేయాలో అంచనాకు రాలేకపోతోంది. అటు ఇతర పార్టీలు, ప్రజల్లోను పవన్ పోటీ చేసే స్థానం ఏంటనేదానిపై ఉత్కంఠ రేపుతోంది. వాస్తవానికి పవన్ ఏ స్థానం నుంచి పోటీచేసినా అది రాష్ట్రస్థాయిలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందనే చెప్పాలి. ఈనేపథ్యంలో పవన్ అడుగులు అసెంబ్లీ స్థానం వైపా, పార్లమెంట్ స్థానంవైపా అనేదానిపై రకరకాల చర్చకు దారితీస్తోంది. వాస్తవానికి తొలుత కాకినాడ సిటీ నుంచి పవన్ పోటీలో ఉంటారనే ప్రచారం ఎక్కువగా జరిగింది. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి అసెంబ్లీకి ఎలా వెళ్తారో చూస్తానని వారాహి యాత్రలో పవన్ శపథం చేశారు. దీంతో ఇక్కడి నుంచే బరిలోకి ద్వారంపూడికి చెక్ పెడతారనే చర్చ జరిగింది. ఆ తర్వాత డిసెంబర్‌లో పవన్ కాకినాడలో మూడు రోజులు పర్యటించారు. ప్రత్యేకంగా కాకినాడ సిటీ నియోజకవర్గం పరిధిలో డివిజన్లవారీ సమీక్ష నిర్వహించారు. ఇక్కడి నుంచి పోటీ చేయాలనే ఉద్దేశంతోనే కాకినాడ సిటీపై ప్రత్యేక దృష్టిసారించారనే అంచనాలు మరింత బలపడ్డాయి. కానీ ఆ తర్వాత కొన్నాళ్లకు పవన్ పిఠాపురం నుంచే పోటీలో ఉంటారనే ప్రచారం జోరందుకుంది. దీనికితోడు ఉమ్మడి పార్టీల అభ్యర్థుల తొలి జాబితా ప్రకటనలో జిల్లాలో మూడు సీట్లను ప్రకటించిన టీడీపీ ఆ జాబితాలో పిఠాపురం సీటు ప్రస్తావించలేదు. దీంతో పవన్ కోసమే ఆ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టారనే చర్చ జరిగింది. నియోజకవర్గం చిన్నదికావడం, కాపు సామాజికవర్గ ఓట్లు భారీగా ఉండడంతో ఇక్కడ గెలుపు సులువు అనే భావనతో పిఠాపురం వైపు పవన్ మొగ్గుచూపుతున్నారనే చర్చ నెలకొంది. అలాగే గొల్లప్రోలు సమీపంలో ఓ హెలీప్యాడ్‌ను ఎన్నికలయ్యేవరకు జనసేన లీజుకు తీసుకోవడంతో పవన్ కోసమే ఇదంతా అనే అంచనాలు నెలకొన్నాయి. దీంతో పిఠాపురం రావడం ఖాయమైపోయిందనే ఊహాగానాలు బలపడ్డాయి.

ఎంపీ అభ్యర్థిగా ఖాయమేనా..

పిఠాపురం నుంచే పవన్‌కల్యాణ్ బరిలో దిగుతారనే బలమైన ఊహాగానాలు ఒకపక్క కొనసాగుతుండగా, ఇప్పుడు కొత్తగా పవన్ కాకినాడ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగవచ్చనే విశ్లేషణలు బలంగా తెరపైకి వస్తున్నాయి. దీంతో పవన్ పోటీపై మరింత ఉత్కంఠ నెలకొనేలా చేసింది. ప్రధానంగా టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు ఖరారైన తర్వాత ఆ ప్రచారం మరింత ఊపందుకుంది. ఎన్డీఏలో ఉన్నందున పవన్ ఎంపీగా నెగ్గి కేంద్రంలో మంత్రి పదవి తీసుకుంటే బాగుంటుందనే చర్చ ఇటీవల ఎక్కువైంది. రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉంటే, కేంద్రంలో పవన్ తన పదవి, పలుకుబడితో రాష్ట్రానికి నిధులు ఎక్కువ వచ్చేలా చేయడానికి అనువుగా ఉంటుందంటూ రాజకీయ విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. తద్వారా మంచి సమన్వయంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి బాగుంటుందనే ప్రతిపాదనలు బీజేపీ వైపు నుంచి కూడా వచ్చినట్టు తెలుస్తోంది. ఈనేపథ్యంలో పవన్ కాకినాడ ఎంపీ అభ్యర్థిగా మొగ్గుచూపవచ్చనే అంచనాలు ప్రస్తుతం నెలకొన్నాయి. వాస్తవానికి జిల్లాలో కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండు చోట్ల పవన్ పోటీ చేస్తారని ఇంతకాలం చర్చ జరిగింది. కానీ ఏదో ఒక్క స్థానంలోనే పవన్ బరిలో పోటీచేస్తారనే స్పష్టత తాజాగా వచ్చినట్టు చెబుతున్నారు. ఇదిలాఉంటే పవన్‌కల్యాణ్ కాకినాడ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటే ఆ ప్రభావంతో మొత్తం పార్లమెంట్ స్థానంలో సీట్లన్నీ క్లీన్ స్వీప్ చేయవచ్చని, ఉమ్మడి జిల్లాలోను అనేక స్థానాలపై బలంగా పవన్ ముద్ర ఉంటుందనే విశ్లేషణలు టీడీపీ, జనసేన పార్టీల్లో వ్యక్తమవుతున్నాయి. కాగా కాకినాడ ఎంపీ సీటు ఆశిస్తున్న అభ్యర్థులు కూడా ఇటీవల ప్రచార జోరు తగ్గించారు. దీంతో పవన్ రావడం ఖాయమవడంతోనే వారు వెనక్కు తగ్గినట్టు తెలుస్తోంది. అయితే ఎన్నికల షెడ్యూల్ సమీపించినందున పవన్ పోటీచేసే స్థానం ఏదనేదానిపై కొద్దిరోజుల్లో స్పష్టత వచ్చి ఉత్కంఠకు చెక్ పడవచ్చని తెలుస్తోంది. ఇదిలాఉంటే పవన్ పిఠాపురం నుంచి పోటీ చేయడం ఖాయమేమో అనే అంచనాలతో అధికార వైసీపీ అప్పుడే కుయుక్తులకు తెరతీసింది. దొంగ ఓట్ల బలం ఇప్పటికే పెంచుకోగా, అనుకూల ఎన్నికల అధికారులను సైతం నియోజకవర్గంలో నియమించుకుంది. దాంతో ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు కూడా వెళ్లాయి.

ఫ్రీ సీట్లకు ఫీజులు చెల్లించాలట!

- అమ్మఒడి సొమ్ములు నుంచి పాఠశాలలకు చెల్లించాలని సూచన
- ఇదెక్కడి ఉచిత సీట్ల పథకమంటూ తల్లిదండ్రుల మండిపాటు
- అవి రాకున్నా ముందే చెల్లించేయాలంటూ ఒత్తిడి
- విద్యాహక్కు చట్టానికి వక్రభాష్యం

ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేదలు, బడుగు, బలహీనవర్గాలు, అభాగ్యులకు ఇచ్చే 25 శాతం ఫ్రీసీట్లకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఆ మొత్తాన్ని అమ్మఒడి నుంచి చెల్లించాలంటూ ప్రభుత్వం సూచిస్తోంది. ఆ సొమ్ములు రాకున్నా మీరే చెల్లించేయాలంటూ తల్లిదండ్రులపై విద్యాశాఖాధికారులు ఒత్తిడి తెస్తూ విద్యాహక్కు చట్టానికి వక్రభాష్యం చెబుతున్నారు. ఉచితమని చెప్పి ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి తేవడం ఏమిటంటూ విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

పిఠాపురం, మార్చి 11: 2009లో అమలులోకి వచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను బడుగుబలహీనవర్గాలు, నిరుపేదలు, అభాగ్యులకు కేటాయించాల్సి ఉంటుంది. వీరికి ఉచితంగానే విద్యను అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఈ చట్టం అమలులోకి వచ్చినా ఎక్కడా ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వకపోవడంతో పలువురు కోర్టులను ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విద్యాహక్కు చట్టం ప్రకారం నిరుపేదలు, అభాగ్యులు, అనాథలకు ఉచిత సీట్లు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి చట్టం అమలు చేయక తప్పలేదు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం స్టేట్ సిలబస్, సీబీఎస్ఈ, ఐబీ, ఐసీఎస్ఈ విధానంలో బోధించే అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఉచిత సీట్లుగా వర్గీకరించారు. 25 శాతం సీట్లలో హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, అనాథ పిల్లలకు 5శాతం, నిరుపేద ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, ఓసీ, మైనార్టీ తదితర ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలకు 6 శాతం సీట్లను కేటాయించాలి. ఈ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి అర్హులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తున్నారు. సరిపడా దరఖాస్తులు వచ్చినచోట కేటాయింపులు చేస్తున్నారు. ఈవిధంగా కాకినాడ జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో 215 మంది పిల్లలకు, 2023-24 విద్యా సంవత్సరంలో 1,141 మంది పిల్లలకు ప్రవేశం కల్పించారు. 2024-25 విద్యాసంవత్సరానికిగానూ ప్రస్తుతం 1వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అంతా ప్రభుత్వమే భరించాల్సి ఉన్నా...

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఫ్రీసీట్లు భర్తీ చేస్తున్నామని చెబుతున్నా ప్రభుత్వం ఫీజులు విషయంలో తన బాధ్యత నుంచి తప్పుకోవడం విమర్శలకు తావిస్తోంది. సీట్లు పొందిన విద్యార్థులకు పట్టణ, నగర ప్రాంతాల్లో ఏడాదికి రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6 వేలు ఫీజుగా నిర్ధారించారు. వాస్తవానికి ఈ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం తమది ఆ బాధ్యత కాదన్నట్టు వ్యవహరిస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులకు వచ్చే అమ్మఒడి నిధుల నుంచి ఫీజులు చెల్లించాలని సూచించింది. ఇప్పటికే అమ్మఒడి కింద ఏటా రూ.15 వేలు కేటాయిస్తామని చెప్పి, వివిధ రూపాల్లో రూ.2 వేలు మేర కోత విధించింది. వచ్చే రూ.13 వేలలో ఫీజులు చెల్లించాలనడం ఎంతవరకూ సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉచిత ప్రవేశాలు అని చెప్పి తమ వద్ద ఫీజులు వసూలు చేయడం ఏమిటని, ఫ్రీసీట్లు అంటూ ప్రచారం ఎందుకని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

సొమ్ములు రాకున్నా..

అమ్మఒడి ద్వారా తొలుత ప్రతి ఏటా జనవరిలో నిధులు విడుదల చేసేవారు. గత ఏడాది నుంచి జూన్‌లో విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఒకటవ తరగతిలో చేరిన వారికి ఈ ఏడాది జూన్‌లో అమ్మఒడి నిధులు తల్లుల ఖాతాలకు జమవుతాయి. ఈ విద్యా సంవత్సరంలో ఫ్రీసీట్లు కింద ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి ఫీజులు రాకపోవడం, గత విద్యా సంవత్సరంలోనూ ఫీజుల బకాయిలు ఉండిపోవడంతో కొందరు ప్రైవేటు విద్యా సంస్థల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. దీంతో విద్యాశాఖాధికారులు అమ్మఒడి రాకున్నా ముందే మీరు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడం వివాదంగా మారింది. తమ వద్ద డబ్బులు లేకే ఫ్రీసీట్లకు దరఖాస్తు చేసుకున్నామని, తీరా ఫీజుల కోసం ఒత్తిడి తేవడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలే మేలు కదా..

ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం ఉచిత ప్రవేశాలంటూ చెప్పుకోవడం మినహా తమకు ఒరిగిందేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉంటే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, బూట్లు, ఇతర సదుపాయాలతోపాటు అమ్మఒడి సొమ్ములు పూర్తిగా తమకే ఉండేవని వారు చెబుతున్నారు. ఫ్రీ సీట్లు వల్ల తమకు కలిగే ప్రయోజనాలకంటే నష్టపోతున్నదే ఎక్కువగా ఉందని వారు తెలిపారు. ఫ్రీసీట్లు ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే భరించాలని, అప్పుడే విద్యాహక్కు చట్టానికి న్యాయం చేసినట్టనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


జేసీ ప్రవీణ్‌ఆదిత్య


జేసీ రామసుందర్‌రెడ్డి

పిఠాపురం ఆర్వో నియామకంపై దుమారం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జేసీ ప్రవీణ్‌ఆదిత్య
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జనసేన
- నిబంధనలు పాటించలేదని కమిషన్‌కు ఫిర్యాదు
- సీఈసీ ఆదేశాలకు పశ్చిమగోదావరికి బదిలీ

7లో

జిల్లా స్థాయి గ్రీవెన్స్‌కు 352 అర్జీలు

కాకినాడ సిటీ, మార్చి 11: జగనన్నకు చెబుదాం-జిల్లాస్థాయి స్పందనకు 352 అర్జీలు అందాయి. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ పీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో డి తిప్పేనాయక్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, సెట్రాజ్ సీఈవో కె.భారతి సౌజన్యలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 33 ఫిర్యాదులు

కాకినాడ క్రైం, మార్చి 11: ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల నుంచి 33 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలు తెలుసుకుని, సత్వర పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. స్పందనకు విచ్చేసిన అర్జీదారులకు డీపీఆర్ స్వామి ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ బి సత్యనారాయణ, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, మార్చి11: 2024-25 విద్యా సంవత్సరానికి 6, 11వ తరగతుల్లో జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రవేశాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేస్తామన్నారు. మంగళవారం నుంచి ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడిమానేసిన వారు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న బాలికలు ప్రవేశాలకు అర్హులని, ఇతర వివరాలకు 9490886106 నెంబర్లో సంప్రదించాలని తెలిపారు.


పీఎం సడక్‌యోజనా పథకం నిధులతో అసంపూర్తిగా నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్





చేబ్రోలు-కత్తిపూడి మధ్య నిర్మిస్తున్న సడక్ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్న దృశ్యం.. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనా నిధులతో చేబ్రోలు పరిధిలో నిర్మించిన సీసీ రోడ్డుకు గీతా విశ్వనాథ్ రోడ్డుగా పెట్టిన పేరు

సడక్ నిధులతో నిర్మించిన రోడ్డుకు వైసీపీ ఎంపీ పేరు

- ఇప్పుడు పిఠాపురం వైసీపీ అభ్యర్థిగా బరిలోకి
- పనులు సగం కూడా పూర్తి కాకుండానే ప్రారంభోత్సవం

గొల్లప్రోలు రూరల్, మార్చి 11: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసీపీ నేతల ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన రోడ్డుకు ఎంపీ పేరు పెట్టేశారు. అది కూడా పనులు 50 శాతం కూడా పూర్తి కాకుండానే ప్రారంభోత్సవం నిర్వహించేశారు. జరుగుతున్న తంతును చూసి ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ మరో నాలుగైదు రోజుల్లో వస్తుండడంతో పూర్తికాని పనులకు ప్రారంభోత్సవాల పేరుతో శిలాఫలకాలు వేసుకుంటూ అధికార వైసీపీ నేతలు హడావుడి చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి శంఖవరం మండలం కత్తిపూడి వరకూ పంట పొలాలు మీదుగా 5.15 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనా ద్వారా 2021లో రూ.3.55 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కిలోమీటరు మేర సిమెంట్ రోడ్డు నిర్మించారు. 3.5 కిలోమీటర్ల పొడవునా తారురోడ్డు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం వెట్‌మిక్స్ వేసే పనులు జరుగుతున్నాయి. బీటీ రోడ్డు నిర్మాణానికి ఇంకా సమయం పడుతుంది. కేవలం 30 శాతం పనులు మాత్రమే పూర్తయిన పనులకు సోమవారం సాయంత్రం కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ప్రారంభోత్సవం చేసేశారు. అసంపూర్తి పనులకు ప్రారంభంచేయడమేగాక ఆ రోడ్డుకు వంగా గీతావిశ్వనాథ్ రోడ్డుగా నామకరణం చేసి ఎంపీ తానే స్వయంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సడక్ నిధులతో నిర్మించిన ఈ రోడ్డుకు ఎంపీ పేరు పెట్టడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఎన్నికల ముందు వైసీపీ నేతల ప్రచార తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. అందులోనూ సదరు నియోజకవర్గం పిఠాపురం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థినిగా వంగా గీతే పోటీచేయబోతున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. ఈ క్రమంలో తన పేరుతో పూర్తికాని పనులను ప్రారంభించడాన్ని ఆక్షేపిస్తున్నారు. ఇక వన్నెపూడి గ్రామంలో ఆదివారం నాడు పనులు పూర్తికాకుండానే గ్రామ సచివాలయ భవనాన్ని ఎంపీ గీత ప్రారంభించడం విమర్శలకు గురైంది.


మత్స్యకార నాయకుల జాయింట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కాకినాడ ఆర్డీవో

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా నిరసన ఆపం

జాయింట్ మీటింగ్‌లో మత్స్యకార నాయకుల అల్టిమేటం

కాకినాడ సిటీ, మార్చి 11 : అరబిందో ఫార్మా కంపెనీ కాకినాడ సముద్రతీర ప్రాంతంలో పైప్‌లైన్ల ద్వారా వదులుతున్న వ్యర్థాల వల్ల మత్స్య సంపద నశించిపోతున్నందున తక్షణం పైప్‌లైన్లు తొలగించాలని, లేనిపక్షంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు నెలకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించే వరకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా నిరసన ఆపేదిలేదని మత్స్యకార నాయకులు అల్టిమేటం జారీచేశారు. దీంతో సోమవారం సాయంత్రం కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కోనపాయిపేట, పెరుమాళ్లపురం గ్రామాల మత్స్యకార నాయకులు, అధికారులతో జాయింట్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో ఇట్ల కిషోర్, కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహనరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి డీఈ శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాకినాడ సముద్రతీరంలో 32 కిలోమీటర్ల మేర 50 గ్రామాలకు చెందిన లక్ష మంది పైగా మత్స్యకారులు సముద్రవేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఈ పైప్‌లైన్ల ద్వారా సముద్రంలోకి వదులుతున్న విషరసాయనాల వల్ల మత్స్యసంపద పూర్తిగా నశించిపోతోందన్నారు. ఈ పైప్‌లైన్ల వల్ల సముద్రంలో వేటకు వెళ్లే బోట్ల వలలు దెబ్బతింటున్నాయన్నారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ మంగళవారం కలెక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పడంతో సమావేశం ముగిసింది.


డీఆర్వో డి.తిప్పేనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

‘ఎన్నికల్లో ఆ ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలి’

కాకినాడ రూరల్, మార్చి11: త్వరలో జరగబోయే 2024 సాధారణ ఎన్నికల్లో అంగవైకల్యం, మెడికల్, మెటర్నిటీ సెలవులో ఉన్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిలకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం కాకినాడ జిల్లాశాఖ ఆధ్వర్యంలో డీఆర్వోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కుసుమంచి కాశీవిశ్వనాథ్‌లు మాట్లాడుతూ దివ్యాంగులు, చంటి పిల్లల తల్లులు, గర్భిణీలకు, 58 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరారు. ఎన్నికల సామాగ్రి తీసుకునేటప్పుడు తిరిగి అందజేసే సమయంలో పీవోలకు హమాలీలను ఏర్పాటుచేయాలని కోరారు. ఎస్టీయూ నాయకులు సత్యనారాయణరాజు, శ్రీను, సుబ్బరాజు, రాజు, సంపత్‌కుమార్, సత్తార్, పి.శ్రీను, శ్రీనివాస్, వీర్రాజులు పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో ఆందోళన నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్లు

జీజీహెచ్‌లో ప్రారంభమైన సమ్మె

జీజీహెచ్(కాకినాడ), మార్చి 11: కాకినాడ జీజీహెచ్‌లో సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం శానిటేషన్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సభ్యులు సమ్మెలో పాల్గొన్నారు. జనవరి 31 నుంచి ప్రారంభమైన ఆందోళన సోమవారం నుంచి అత్యవసర సేవలు మినహాయించి పూర్తిస్థాయిలో సమ్మెకు వెళ్తున్నట్టు యూనియన్ నాయకులు తెలిపారు. పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్లిన శానిటేషన్ వర్కర్లతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ జోక్యంతో కాంట్రాక్ట్ సంస్థ తరపున జి.రాంబాబు పలుసార్లు చర్చలు జరిపారు. పీఎఫ్, ఈఎస్ఐ సిబ్బంది జీతాల నుంచి కటింగ్, వేతనాల పెంపుపై చర్చించారు. ఈ విషయాలను కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని రాంబాబు తెలిపారు. మంగళవారం మరోసారి చర్చలు జరిపించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని యూనియన్ నాయకులు తెలిపారు. సీఐడీయూ నాయకులు పలివెల వీరబాబు, మలక వెంకటరమణలు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	సా.6.21
సహరి (బుధ)	ఉ.4.52

పిఠాపురం ఆర్వో నియామకంపై దుమారం

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జనసేన

నిబంధనలు పాటించలేదని రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు

సీఈసీ ఆదేశాలతో పశ్చిమగోదావరికి బదిలీ

పిఠాపురం, మార్చి 11: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా జేసీని ప్రవీణ ఆదిత్య నియామకం రాజకీయ దుమారం లేపింది. ఆయన నియామకంలో నిబంధనలు పాటించలేదనే ఆరోపణలతో, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు జనసేన ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను పశ్చిమగోదావరి జేసీగా బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం ఉన్న నేపథ్యంలో ఇక్కడి ఎన్నికలను అధికార వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పవన్ పోటీ చేస్తే ఎలాగయినా ఓడించాలని ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకుగాను తమకు అనుకూలమైన అధికారులు నియోజకవర్గ పరిధిలో ఉండేలా అధికార వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే రంపచోడవరం ఐటీడీఏ పీవోగా, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసిన ప్రవీణ ఆదిత్యను జిల్లా జాయింట్ కలెక్టరుగా నియమించడంతోపాటు పిఠాపురం అసెంబ్లీ ఆర్వో బాధ్యతలు అప్పగించడంపై జనసేన పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, లీగల్‌సెల్ చైర్మన్ సాంబశివ ప్రతాప్, కార్యదర్శి కోటేశ్వరరావు అమరావతిలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కు మార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే నాలుగేళ్లకు పైగా విధులు నిర్వర్తించిన అధికారిని ఇక్కడ ఎలా నియమిస్తారని వారు ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా జేసీగా, పిఠాపురం ఆర్వోగా నియామకం జరిగిందని వారు ఫిర్యాదులో తెలిపారు. అధికార పార్టీ నేతలతో ఆయనకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. తక్షణం ఆయన్ను ఆర్వో బాధ్యతలనుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. మరోవైపు పిఠాపురం నియోజకవర్గంలో ఫారం-7 తప్పుడు దరఖాస్తుల ద్వారా ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన అధికారులు దరఖాస్తుల్లో వాస్తవం లేదని తేలడంతో అధికార వైసీపీకి చెందిన పలువురు నేతలపై పోలీసు కేసులు నమోదయ్యాయి.

అంతా రహస్యమే

పిఠాపురం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమితులైన జేసీ ప్రవీణ్ ఆదిత్య వ్యవహారశైలిని పలువురు తప్పుబట్టారు. ఆర్వోగా నియమితులైన తర్వాత ఆయన పిఠాపురంలో నిర్వహించిన సమావేశాలకు సంబంధించి మీడియాకు సమాచారం లేకుండా గోప్యంగా నిర్వహించడాన్ని టీడీపీ, జనసేన నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, సమావేశాలు అందరికి తెలియాల్సి ఉండగా, గోప్యంగా ఉంచడం ఎందుకని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్యపై బదిలీ వేటు పడింది. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధుల్లో చేరిన కొద్ది నెలల్లోనే ఆయన్ను పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ చేశారు. ఆ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా జేసీగా ఉన్న ఎస్.రామసుందరెడ్డిని జిల్లా జేసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సినిమాల ద్వారా తెలుగు సాహిత్యానికి పెద్దపీట



మాట్లాడుతున్న మీర్ అబ్దుల్లా

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 11: సినిమా ద్వారా తెలుగు సాహిత్యానికి పెద్ద పీట వేయాలని పడమట సంధ్యారాగం చిత్ర సహ నిర్మాత, సినీ నటుడు మీర్ అబ్దుల్లా అన్నారు. ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన పడమటి సంధ్యారాగం చిత్రానికి సహ నిర్మాతగాను, హీరోయిన్ చిన్నాన్న పాత్రలోను నటించానన్నారు. పూర్తి గ్రామీణ వాతావరణంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా పడమటి సంధ్యారాగం రెండో భాగానికి . దర్శకత్వం వహిస్తున్నానని చెప్పారు. వర్తమాన నటీనటులతో చిత్రం రూపొందిస్తున్నానని, కథ సిద్ధమైందని తెలిపారు. ఈ వారంలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వస్తుందని చెప్పారు. పడమటి సంధ్యారాగం చిత్రంలో జాతి, మత, ప్రాంతీయ సామరస్యం అంతర్లీనంగా ఉంటుందని, ఇప్పుడు తీస్తున్న రెండో భాగంలో అన్ని అంశాలు మిళితమై ఉంటాయన్నారు. సమావేశంలో కవి, రచయిత వేదుల శిరీషా పాల్గొన్నారు.

ఓటుంటే..చీర



చీరలు పంపిణీ చేస్తున్న వారి దగ్గర గుమిగూడిన జనం

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రలోభాల చీరల పంపిణీ తంతు కొనసాగుతూనే ఉంది. ఎన్నికల వేళ తాయిలాలను ఇంటికి వెళ్లి మరీ చేతిలో పెడుతున్నారు. సోమవారం నారాయణపురం, సీతంపేట, లలితానగర్ తదితర చోట్ల పంపిణీ జరిగింది. ఐదారుగురు వైసీపీ కార్యకర్తల బ్యాచ్‌కి వలంటీరు, సచివాలయ సిబ్బందిని జతకలిపి వీధుల్లోకి పంపుతున్నారు. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, ఓటరు లిస్టులో పేరు చెక్ చేసి చీరను అందజేస్తున్నారు. సోమవారం నారాయణపురంలో చీరలు ఇస్తున్న సమయంలో ఒకామె ఓటును ఎగరగొట్టేశారనే విషయం తెలిసింది. దీంతో సచివాలయానికి వెళ్లాలని చీరల పంపిణీ బృందం ఆమెకు ఉచిత సలహా ఇచ్చింది. తన ప్రమేయం లేకుండా ఓటు ఎలా తొలగించారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. పైగా చీరల పంపిణీ బృందం వద్ద ట్యాబ్ ఉంటోంది. ఆ ట్యాబ్‌లో కూడా ఓటును, డోర్ నంబరును సరి చూసుకుంటున్నారు. కచ్చితంగా అవి సరిపోలితేనే చీర ఇస్తున్నారు. ఓటు లేని లేదా సాంకేతిక ఇబ్బందులు ఉన్నా, ఓటరు లిస్టులో పేరు లేకపోయినా చీర ఇవ్వడం లేదు. పంపిణీ చేయడానికి జిల్లాకు లక్షల సంఖ్యలో చీరలు వచ్చినట్టు సమాచారం. ఆయా ప్రాంతాల నాయకుల కనుసన్నల్లో తంతు నడుస్తోంది.

తాయిలాల పర్వం



పంపిణీ చేసిన చీర

మహిళలకు చీరలు పంపిణీ చేసిన చిర్ల జగ్గిరెడ్డి

వేర్వేరు చోట్ల మహిళా దినోత్సవం పేరుతో ప్రలోభాలకు తెర



చీరలు పంపిణీ చేస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం, మార్చి 11: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం ఓటర్లకు తాయిలాల పంపిణీకి వైసీపీ తెరలేపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఏ కార్యక్రమం జరుగుతున్నా దానిని తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. సోమవారం రావులపాలెంలో రెండు వేర్వేరు చోట్ల మహిళా దినోత్సవం నిర్వహించి మహిళలకు చీరలు, స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. సీఆర్సీలో రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వైసీపీ తరపున పోటీ చేసి ఓటమి చెందిన వారితో సమావేశం కాగా.. మరో ప్రైవేటు కల్యాణ మండపంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, యానిమేటర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు సిబ్బందితో మహిళా దినోత్సవం వేడుకల్లో సమావేశమయ్యారు. విడివిడిగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఆయన సతీమణి, కుటుంబ సభ్యులతో పాటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. జగన్, జగ్గిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సోమసుందరెడ్డి ఫొటోలతో ఉన్న చీర బాక్సు, స్వీటు బాక్సులను మహిళలకు అందజేసి తన గెలుపునకు కృషి చేయాలని కోరినట్టు సమాచారం. అంతే కాకుండా పలు రకాల వంటకాలతో పసందైన విందును కూడా మహిళల కోసం ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకే జగ్గిరెడ్డి ఇలాంటివి చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

మమ్మల్ని వదిలేయండి..వెళ్లిపోతాం

వైసీపీ నేతల సభకు వచ్చిన మహిళలు గగ్గోలు



మహిళలను అడ్డుకుంటున్న యానిమేటర్లు

అంబాజీపేట, మార్చి 11: మమ్మల్ని వదిలేయండి..వెళ్లిపోతాం అంటూ వైసీపీ నేతల సభకు వచ్చిన మహిళలు గగ్గోలు పెట్టారు. అయినా వారిని వదలకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ 4వ విడత చేయూత నిధుల విడుదల కార్యక్రమం మహిళలకు చుక్కలు చూపించింది. ఈ సభకు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైసీపీ చేసిన కార్యక్రమాలు, పథకాలంటూ ప్రసంగాలను ఏకరవు పెట్టారు. అయితే ఈ సభను మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తారని చెప్పడంతో ముందుగానే మహిళలు సభా వేదిక వద్దకు వచ్చారు. ప్రజాప్రతినిధులు ఆలస్యంగా రావడంతో సభ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు వెళ్లిపోతున్న సమయంలో డ్వాక్రా యానిమేటర్లు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రసంగాలు జరిగే వరకూ తాము ఉండలేమని యానిమేటర్లతో మహిళలు వాగ్వివాదానికి దిగారు. మహిళలు వెళ్లిపోవడంతో సభను త్వరగా ముగించివేశారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయవరం, మార్చి 11: రాయవరం మండలం చెల్లూరు శివారు ఎర్రమట్టిపురంలో రేకుల షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా 24 బస్తాల్లో నిల్వ ఉంచిన 1035 కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కోట సత్యం అనే వ్యక్తి చెల్లూరు, పాశర్లపూడి గ్రామాల్లో కార్డుదారుల నుంచి కిలో బియ్యం 14 రూపాయలకు కొనుగోలు చేసి మొక్కజొన్న విత్తనాలు కలిపి కోళ్లఫారాలకు 16 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.53 వేల 92 రూపాయలు ఉంటుందని అంచనా వేసి కోట సత్యంతో పాటు సంబంధికులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమండ్రి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బియ్యం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎవరైనా రేషన్ బియ్యం కొనుగోలు, అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథం, రాయవరం సీఎస్‌డీటీ అవిషా, జీవానందం, లోవరాజు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నాలుగేళ్ల శిక్ష

అమలాపురం టౌన్, మార్చి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామంలో 2010 డిసెంబరు 30న జరిగిన దోపిడీ కేసులో ముద్దాయి తిల్పిడియా రంజిత్‌సింగ్ అలియాస్ బడాసింగ్‌కు నాలుగేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ రామచంద్రపురం సెషన్స్ కోర్టు జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు ఇచ్చినట్టు ఎస్పీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... ఏరుపల్లిలో చల్లా వెంకటేశ్వరరావు ఇంట్లో అర్ధరాత్రి సమయంలో నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన రంజిత్ సింగ్‌తో పాటు మరో ఏడుగురు చొరబడ్డారు. వెంకటేశ్వరరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి బంగారు ఆభరణాలు అపహరించుకుని పారిపోయారు. అప్పట్లో వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఎండీ ఉమర్ కేసు నమోదు చేయగా సీఐ ఎం.రాజారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. రంజిత్‌సింగ్‌తో పాటు మిగిలిన వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు.స్పీడీ ట్రయల్ కేసుగా గుర్తించి ఎస్ఐ సురేంద్రతో పాటు కోర్టు కానిస్టేబుల్ వాసిరెడ్డి జానకిరామయ్య కోర్టులో సాక్ష్యులను హాజరుపరచగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంవీవీఎస్ఎస్ ప్రకాష్ వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం రంజిత్‌సింగ్‌పై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు.

హంస వాహనంపై కుక్కుటేశుడు

పాదగయలో ఘనంగా శ్రీపుష్పోత్సవం



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు

పిఠాపురం మార్చి 11: భక్తుల శివనామస్మరణ మధ్య అమ్మవారితో కలిసి కుక్కుటేశుడు హంస వాహనంపై పుష్కరిణిలో విహరించారు. శ్రీపుష్పోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు కుక్కుటేశుని తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం

కుక్కుటేశ్వరస్వామికి ఉదయం స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీ దేవికి కుంకుమార్చనలు జరిగాయి. రాత్రి పది గంటలకు శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు కోట వీరవెంకట సత్యనారాయణమూర్తి, కోట దత్తాత్రేయశర్మ, కైతేపల్లి రాజ్‌కుమార్‌శర్మ, కోట విశ్వనాథశర్మ విశేష అలంకరణ చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు దంపత తాంబూలాలు అందజేశారు. అనంతరం ఏకాంతసేవాగానం జరిగింది. ఆస్థాన వేద పండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, ఉత్సవకమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తోపులాట

శ్రీపుష్ప యాగం తర్వాత భక్తులకు దంపత తాంబూలాలు అందించే సమయంలో తోపులాట చోటుచేసుకుంది. తెప్పోత్సవం, పూజా కార్యక్రమాల నిర్వహణ ఆలస్యం కావడంతో రెండు గంటలకు పైగా వేచి ఉన్న భక్తులందరినీ ఒకేసారి వదిలారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోపలకు వెళ్లేందుకు ఒకేసారి భక్తులు ప్రయత్నించడం, క్యూలైన్లు సరిగ్గా లేకపోవడం, దంపత తాంబూలాలకు భారీగా భక్తులు తరలివస్తారని తెలిసినా, తగిన ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారులు విఫలం కావడం వల్ల ఈ సంఘటన చోటుచేసుకుందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఒకరి మృతి..ముగ్గురికి గాయాలు



అనపర్తి, మార్చి 11: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం వంతెన వద్ద సోమవారం రెండు బైకులు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్రగాయాలపాలయ్యారు. వారిలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండపేటకు చెందిన ఇళ్ల సూర్యసాయిరామ్, ఇప్పనపాడుకు చెందిన గొరసా సాయిచంద్ ఒక బైక్‌పై వస్తుండగా మరో బైక్‌పై మండపేటకు చెందిన కొమ్మిశెట్టి వెంకటేష్(29), సత్తిబాబు సోదరులు పెద్దాపురం పనికి వెళ్లి పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో వస్తున్నారు. వారి రెండు బైక్‌లు లక్ష్మీనరసాపురం కెనాల్ రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన అందరినీ రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా వెంకటేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

గంజాయి స్వాధీనం

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

రాజానగరం, మార్చి 11: ఒడిసా నుంచి కేరళ రాష్ట్రానికి గంజాయిని తరలిస్తున్న నలుగురు రాజానగరం పోలీసులకు పట్టుబడ్డారు. కేరళకు చెందిన నలుగురు వ్యక్తులు లగేజీ బ్యాగుల్లో 39.35 కిలోల గంజాయిని లారీలో తరలిస్తుండగా మార్గమధ్యంలో తూర్పుగోనగూడెం పోలీసు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు చిక్కారు. లారీలో ప్రయాణికులు మాదిరిగా బ్యాగుల్లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

పంట బోదెలో మృతదేహం

కాజులూరు, మార్చ్ 11: కాజులూరు మండలం కోలంక శివారు చలివేంద్రపాడు వెళ్లే రోడ్డులో పందుల పాక సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్, ఇతర పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం మొత్తం ఉబ్బిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. ముఖానికీ, శరీరానికి పురుగులు పట్టి దుర్వాసనతో కూడుకుని ఉంది. శరీరంపై తెలుపు, పచ్చ రంగు చారలు కలిగిన పొడవు చేతుల చొక్కా, సిమెంటు రంగు నిక్కరు, మెడలో తెలుపు రంగు తువ్వాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు సుమారు 5 రోజుల క్రితం మరణించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసిన గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీపుష్ప యాగోత్సవం



ఊయల మందిరంలో స్వామి,అమ్మవారు

సామర్లకోట, మార్చి 11: కుమారరామ భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లకు శ్రీపుష్పయాగోత్సవ పూజలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ ఫెస్టివల్ అధికారిణి అల్లు వెంకట దుర్గాభవాని, కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో భాగంగా కల్యాణ వేదికపై స్వామి వారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్, వెంకన్న తదితరుల ఉత్సవ మూర్తులను బాలాత్రిపుర సుందరి అమ్మవారి మందిరం వద్దకు తీసుకుని వచ్చారు. వివిధ రకాల పూలతో అలంకరించిన ఊయల మందిరంలో ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి భక్తుల దర్శనాలకు అనుమతించారు. దాతలు సమకూర్చిన 110 రకాల పిండి వంటకాలను ఊయల మండపం వద్ద ఉంచారు. అనంతరం ప్రముఖులకు దంపత తాంబూలాలు అందజేశారు. సుమారు 2,000 మంది భక్తులు శ్రీపుష్పయాగ పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, తూతిక కామేశ్వరరావు, చుండ్రు శ్రీనువాసుసూర్యభాను, కంచర్లపద్మావతి జగన్నాథగుప్త, గంజి బూరిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్సీహెచ్ఈ వైస్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు

ఏబీసీ ద్వారా డిగ్రీ, డిప్లమో, పీజీ డిప్లమో కోర్సులు

జేఎన్టీయూకే, మార్చి 11: అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) ద్వారా డిగ్రీ, డిప్లమో, పీజీ డిప్లమో కోర్సులు విద్యార్థులు పూర్తిచేసేందుకు వీలు కలుగుతుందని ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు అన్నారు. జేఎన్టీయూకేలోని వీసీ సమావేశ హాల్లో ఓడీఎల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఎన్ఏడీ డిజిలాకర్, డిజిటల్ ఇండియా కార్పొరేషన్, ఎంఈఐటీ సహకారంతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ప్రతినిధులకు ఏబీసీ విధానాలు, ప్రక్రియలు, సమ్మతి అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దీనిలో రామ్మోహన్‌రావు ముఖ్య అతిథిగానూ, వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు,రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత గౌరవ అతిథులుగానూ పాల్గొనగా ఓడీఎల్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం ఏబీసీ దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ఒక కోర్సులో తగిన క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ మెకానిజంతో చదువుకునేందుకు, విద్యార్థులు సులభతరంగా విద్యనభ్యసించేందుకు ఉద్దేశించిందన్నారు. అనంతరం వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఏబీసీ ద్వారా విద్యార్థి క్రెడిట్‌ల ప్రామాణికతను గోప్యంగా ఉంచడంతో పాటూ డిజిటల్ మోడ్ ద్వారా సులభంగా క్రెడిట్‌లను బదిలీ చేసుకోవచ్చన్నారు. 2020-21 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈనెల 31లోగా గ్రేడ్ షీట్‌లను ప్రచురిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రవిపాండే, ఎస్.చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీకి మాజీ ఎంపీ గీతకు అడ్డంకులు తొలగినట్టే

రంపచోడవరం, మార్చి11: వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు అడ్డంకిగా ఉన్న సీబీఐ కేసులో శిక్షను తెలంగాణా హైకోర్టు రద్దు చేసింది. బ్యాంకును మోసగించిన కేసులో కొత్తపల్లి గీతకు సీబీఐ కోర్టు శిక్ష, జరిమానా విధించిన విషయం తెలిసిందే. దీనిపై ఆమె తెలంగాణ హైకోర్టులో అప్పీలుకు వెళ్లారు. ఆ కేసు విచారణలో ఉంది. అయితే ప్రస్తుతం ఆమె బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమవడంతో దిగువ కోర్టు విధించిన శిక్షను రద్దు చేసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత కల్పించాలని కొత్తపల్లి గీత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆమె చేసుకున్న వినతిని హైకోర్టు ఆమోదించింది. ఆమెపై ఉన్న శిక్షను రద్దు చేస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసింది.

జీజీయూలో మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ప్రారంభం



ఓ విభాగాన్ని పరిశీలిస్తున్న చైతన్యరాజు

రాజానగరం, మార్చి 11: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిని చైతన్య సంస్థల చైర్మన్, జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు కలిగి ఉండడం మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ప్రత్యేకత అన్నారు. తమ సంస్థ ప్రతి ఉద్యోగి, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. జీజీయూ ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ఇతరులు కూడా ఆసుపత్రి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమలాపురంలోని కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించి తొలి మెడిసిన్ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అనంతరం మెడ్ యునైటెడ్ ఆసుపత్రిని చైతన్యరాజు ప్రారంభించగా, జనరల్ వార్డును శశికిరణ్ వర్మ, ఫార్మసీని రవికిరణ్ వర్మ, కన్సల్టేషన్ గదులను డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ, ప్రత్యేక గదులను డైరెక్టర్ టీవీ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో గైట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.లక్ష్మీ శశివర్మ, పీజీ రామానుజం, బాబు, కె.వల్లీమావి, రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రేపు జాబ్‌మేళా

కార్పొరేషన్(కాకినాడ),మార్చి11: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. పలు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తిగలవారు తమసర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్‌లతో జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలన్నారు. సహాయంకోసం 0884-2373270 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఉద్యోగినికి ఘన వీడ్కోలు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 11: రాజమహేంద్రవరం జీజీహెచ్ గ్రేడ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవీ విరమణచేసిన కె.ఝాన్సీలక్ష్మీబాయిని సోమవారం కాకినాడ జీజీహెచ్‌లో ఘనంగా సత్కరించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్.సంధ్యారాణి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఫ్లోరెన్స్, హెడ్ నర్స్ ఎస్వీ భారతి, స్టాఫ్ నర్స్ అనిగ్రస్ పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నాకుల

కిర్లంపూడి, మార్చి11: ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నాకుల వీరాంజనేయులు రెండోసారి ఎన్నికయ్యారు. రైతు కూలీ సంఘం 43వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో సోమవారం రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. కామ్రేడ్ కర్నాకుల వీరాంజనేయులు 2017లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై ఏడేళ్లు తన బాధ్యతలను పూర్తిచేశారని పలువురు కొనియాడారు. జిల్లాకు చెందిన వల్లూరి రాజబాబు రాష్ట్రకార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

శిశువికాసం-దృక్పథాలు పుస్తకావిష్కరణ

సర్పవరం జంక్షన్, మార్చి 11: వాకలపూడి ఉమామనో ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్వీ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శిశు వికాసం-దృక్పథాలు ఇంగ్లీషు పుస్తకాన్ని రాజమహేంద్రవరంలో అక్నూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.పద్మరాజు ఆవిష్కరించారు.

గోపాలమిత్రల నిరసన

కాకినాడ సిటీ, మార్చి 11: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ కాకినాడ ధర్నాచౌక్‌వద్ద గోపాలమిత్రలు సోమవారం నిరసన శిబిరాన్ని నిర్వహించారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ అనుబంధ ఆంధ్రప్రదేశ్ గోపాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్య క్షుడు దువ్వా శేషబాబ్జీ, సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రా జు మాట్లాడారు.

'హిందూ ధర్మ పరిరక్షణకు కృషి'

పిఠాపురం, మార్చి 11: హిందూధర్మ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో సోమవారం సద్భావన సదస్సు జరిగింది. హిందూ ధర్మరక్షణలో కులసంఘాల పాత్ర అంశంపై జరిగిన ఈ సదస్సులో వక్తలు మాట్లాడారు. సత్యరామచంద్రరావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ఆంధ్ర ధర్మజాగరణ సమితి ప్రతినిధి కొండారెడ్డి, వివిధసంఘాల ప్రతినిధులు మాట్లాడారు.

అలరించిన నృత్య ప్రదర్శన

పిఠాపురం, మార్చి 11: పిఠాపురం పాదగయ క్షేత్రంలో చిన్నారులు నృత్యప్రదర్శన అలరించింది. పాదగయలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన నటరాజ నృత్యనికేతన్, లక్ష్మీ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, ఇతర ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వారిని ఆలయ ఈవో పులి నారాయణమూర్తి సత్కరించి మెమోంటోలు అందజేశారు.

నూకాలమ్మ తొలిగరగ ఉత్సవం

పెద్దాపురం, మార్చి 11: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తొలిగరగ ఉత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాన వీరాస్వామి ఆధ్వర్యంలో ఉత్సవాన్ని నిర్వహించారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

పెద్దాపురం, మార్చి 11: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకా లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేతలు పైడా కృష్ణమోహన్, పెదిరెడ్డి రవికిరణ్, తుమ్మల పద్మజ అన్నారు. మండలంలోని పులిమేరులో పార్టీ జెండా ఆవిష్కరణలో సోమవారం వారు పాల్గొన్నారు.

'కిట్స్' విద్యార్థులకు అవార్డులు

పెద్దాపురం, మార్చి 11: దివిలి కిట్స్ మహిళా ఫార్మసీ కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ సదస్సులో అవార్డులు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గుడిపాటి మధు తెలిపారు. విజయవాడలో విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో 18వ ఇండోమలేషియా అంతర్జాతీయ సదస్సులో తమ విద్యార్థులకు అవార్డులు లభించాయన్నారు.

ఆర్వో ప్లాంట్ వితరణ

రౌతులపూడి, మార్చి 11: రౌతులపూడి ప్రభుత్వాస్పత్రికి రౌతులపూడికి చెందిన యాదవ కాలనీ సభ్యులు మంచినీటి ఆర్వోప్లాంట్ అందజేశారు. కాంక్రీట్ కార్మిక సంఘం సభ్యులు రూ.లక్షా70వేలు విలువ చేసే ఆర్వో ప్లాంట్ ఉచితంగా అందజేశారు. ఈ ప్లాంట్‌ను మండల సాధకుడు రెడ్డి బుల్లాబ్బాయి ప్రారంభించారు. ఆస్పత్రి డైరెక్టర్ కేదారశెట్టి నాగేశ్వరరావు, సంఘం అధ్యక్షుడు గోవింద్, శ్రీనివాస్, కోటిపల్లి నాగుమేస్త్రి పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

కాకినాడ రూరల్, మార్చి 11: రూరల్ మండలం తూరంగి మహాలక్ష్మీనగర్‌కు చెందిన కలా జాహ్నవిశ్రీ(22) సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని యువతి తల్లి ఫిర్యాదు చేసినట్లు ఇంద్రపాలెం ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరప, మార్చి 11: అనారోగ్య సమస్యలు తాళలేక పురుగులమందు తాగి కరప మండలం వేములవాడ గ్రామానికి చెందిన జ్యోతుల సత్యసాయిబాబు(64) మృతిచెందినట్టు ఏఎస్ఐ వి.సూరిబాబు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నంపై కేసు

కరప, మార్చి 11: బాధితురాలి ఫిర్యాదు మేరకు అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కరప మండలం గొర్రిపూడికి చెందిన శ్రీపాదం లోవరాజు మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం భార్య వెంకటలక్ష్మిని వేధించడం మొదలెట్టాడు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: భీమా, గామి, ప్రేమలు, ఓ లవ్ బ్యాడ్‌బాయ్స్, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: భీమా, గామి, ప్రేమలు, బబ్లిబౌన్సర్ గయ్, ఆపరేషన్ వాలెంటైన్, బాబు నెంబర్ 1, దుని, బుల్లెట్

తిరుమల	:	భీమా
లక్ష్మి	:	భీమా
సీ అండ్‌సీ1	:	గామి
సీ అండ్‌సీ2	:	ప్రేమలు
శ్రీప్రియ	:	గామి
పద్మప్రియ	:	ప్రేమలు
సత్యగౌరి	:	గామి, ప్రేమలు
సూర్య 1	:	గామి
సూర్య 2	:	భీమా

'రైతుల ఇబ్బందులు పట్టించుకోని పాలకులకు బుద్ధి చెప్పాలి'

తాళ్లరేవు, మార్చి 11: తాళ్లరేవు మండలంలోని శివారు ఆయకట్టుకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇంజరం వంతెన నిర్మించకుండా చేతులు దులుపుకున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని ముమ్మిడివరం నియోజకవర్గం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం పిల్లంక, గోపిలంక, గోపాలపురం, కొత్తకొంపలు, చిన, పెదగోవలంకలు, అరటికాయలంక, ఇంజరంల్లో ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, గంటి హరీష్ మాధుర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన అంతమొందించి సుపరిపాలన తెచ్చేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీలతో కలసి ఎన్నికల్లో ముందుకు వచ్చారన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాళ్లరేవు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమేకాక రైతుల ఇబ్బందులను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ తన తండ్రిని మరపించేలా అమలాపురం పార్లమెంటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీ పొన్నమండ రామలక్ష్మి, మాజీ ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, సాగి వెంకటసుబ్బరాజు, వేగేశ్న భాస్కరరాజు, మోపూరి వెంకటేశ్వరరావు, జనసేన వీరమహిళ ముత్యాల జయలక్ష్మి, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ-బీజేపీ కూటమిదే విజయం: నానాజీ

పెనుగుదురు(కరప), మార్చి 11: వచ్చే ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీ కూటమిదే విజయమని కాకినాడరూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ ధీమా వ్యక్తం చేశారు. పెనుగుదురులో సోమవారం ఆయన పర్యటించి జనసేనపార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసుగుపోయారని, ధృతరాష్ట్ర పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడానికి ముందుకు సాగాలనే నిర్ణయానికి ఓటర్లు వచ్చేశారన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు తుమ్మలపల్లి మాచరరావు, రెడ్డిపల్లి నారాయణరావు, బండారు మురళి, బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబు, రెడ్డిపల్లి భాస్కర్, గట్టి రవి, గండి వెంకటేశ్వరరావు, పబ్బినీడి హరిబాబు, గంటా నానిబాబు, ముద్రగడ రమేష్ పాల్గొన్నారు.

'పార్టీ నిర్ణయమే శిరోధార్యం'

గండేపల్లి, మార్చి 11: పార్టీ నిర్ణయమే శిరోధార్యమని జనసేన ఉమ్మడి జిల్లాల ప్రోగ్రామ్ కమిటీ కోఆర్డినేటర్ రామకుర్తి నరసింహం అన్నారు. మండలంలోని మల్లేపల్లిలో సోమవారం ఓ కల్యాణ మండపంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీ నిర్ణయాలు పాటిస్తూ ముందుకెళ్తామన్నారు. ఇప్పటివరకు జనసేన ఇన్‌చార్జిగా ఉన్న పాటంశెట్టి సూర్యచంద్ర ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతున్న సంగతి తెలిసిందేనన్నారు. పొత్తులో భాగంగా జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూకు సీటు ఇచ్చారని, పార్టీ నిర్ణయం మేరకు ఆయనకు మద్దతుగా పనిచేస్తామని తెలిపారు. జనసేన నాయకులు బత్తుల రమణ, రామకుర్తి సత్తిబాబు, బత్తుల కాపు, మల్లాబత్తుల రాజు, ఆకుల ప్రసాద్, బలిరెడ్డి గణేష్, వెలిది వెంకటరత్నం, వల్లభశెట్టి రాజు, రామకుర్తి రాజు, ఆర్.పెదకాపు, వెలిది చిన్ని, పితాని వీరబాబు, పోతుల లోవరాజు, బండారు లోవరాజు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ కార్యకర్తలు ఆత్మీక కలయిక

జగ్గంపేట, మార్చి11: జగ్గంపేట నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ రెండురోజులపాటు జగ్గంపేట నియోజకవర్గం జనసైనికులను ప్రత్యక్షంగా కలిసేందుకు కార్యాచరణ తెలియజేశారు. ఈనెల 13వ తేదీ బుధవారం ఉదయం 9గంటలకు మామిడాడలో ప్రారంభించి ఉదయం 10గంటలకు నరేంద్రపట్నం, 10.30గంటలకు భావారం, 10.45కు కాండ్రేగుల, 11గంటలకు గొల్లలగుంట, 11.30కు నగరుపేట, 12కు గుర్రంపాలెం, 12.30కు మర్రిపాక, ఒంటి గంటకు రామవరంల్లో టీడీపీ, జనసేన నాయకులు ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అదేరోజు మధ్యాహ్నం 4గంటలకు గండేపల్లి మండలం జడ్పీటీసీ పరిమి మంగతాయారుబాబు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిక ఉంటుందన్నారు. రెండవరోజు ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నామన్నారు.

'పొత్తుతో సీఎం జగన్‌లో వణుకు'

సర్పవరం జంక్షన్, మార్చి 11: జనసేన-టీడీపీ-బీజేపీ కలయికతో సీఎం జగన్ వెన్నులో వణుకు ప్రారంభమైందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని కాకినాడ రూరల్ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. సోమవారం కాకినాడ రూరల్ సూర్యారావుపేటలో గౌడ బీసీ సంఘం సీనియర్ నాయకులు శెట్టి బాబూరావు 50మంది అనుచరులు, మత్స్యకారులతో కలసి జనసేనలో చేరగా, వీరికి పంతం నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గుర్రాల రాము, కోమలి గణేష్, దూడా సురేష్, గంటా రాజేష్, మడదా దావీదు, సూరాడ పుష్పవతి, ఎజ్జల నూకరత్నం, చింతకాయల వీరబాబుతోపాటూ మహిళలు పార్టీలో చేరారు. రాయుడుపాలెంలో విజ్జపురెడ్డి ఏసు, తాటికాయల వీరబాబు ఆధ్వర్యంలో ఏపీఎస్పీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగులతో ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ఏవీ నగరంలో ఇంటింటి ప్రచారం

తొండంగి, మార్చి 11: ఏవీనగరంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుని సోదరుడు యనమల నాగేశ్వర్రావు, మాజీ ఎంపీపీ యనమల కృష్ణ, కొయ్యా రామకేశవ టీడీపీ పథకాల గురించి వివరించారు. పార్టీ రూపొందించిన కరపత్రాలను అందించి వాటి ద్వారా ప్రజలకు చేకూరే మేలును తెలిపారు. తుని నియోజకవర్గ అభ్యర్థి యనమల దివ్యను గెలిపించాలన్నారు. వారి వెంట యనమల సత్యన్నారాయణ, కొయ్యా సూరిబాబు, పిర్ల సత్యన్నారాయణ, శివ ఉన్నారు.

మొక్కుబడిగా సామర్లకోట కౌన్సిల్ సమావేశం

సామర్లకోట, మార్చి 11: సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ అధ్యక్షతన నిర్వహించగా అజెండా చదివేందుకు అధికారి ప్రయత్నించగా వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ మాట్లాడుతూ అజెండా చదవొద్దు.. అంశాలన్నీ అధికారపక్ష సభ్యులం ఏకగ్రీవంగా ఆమోదించేందుకు ప్రతిపాదిస్తున్నాం అంటూ ప్రకటించారు. దీంతో చైర్‌పర్సన్ అరుణ ఆమోదిస్తున్నట్టు ప్రకటించి సమావేశం ముగిసినట్టు ప్రకటించారు. మెజార్టీ కోరం సభ్యులు హాజరులేకుండా ఎలా ఆమోదిస్తారని ప్రతిపక్ష సభ్యుడు బలుసు శ్రీనివాసు అభ్యంతరం వ్యక్తంచేసినా ఏమాత్రం లెక్కచేయకుండా ఆమోదిస్తున్నట్టు ప్రకటించారు. తర్వాత చైర్‌పర్సన్ చాంబర్లో అరగంటకుపైగా పిచ్చాపాటి చర్చల్లో నిమగ్నమవ్వడం గమనార్హం.

సమస్యలపై నిలదీసిన వైసీపీ కౌన్సిలర్లు.. నగర పంచాయతీ సమావేశం

ఏలేశ్వరం, మార్చి11: ఏలేశ్వరం నగర పంచాయతీ సాధారణ సమావేశంలో సమస్యలపై వైసీపీ కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ బీహెచ్ శ్రీనివాస్ అజెండా చదివిన అనంతరం అధికారంలో ఉన్న వైసీపీకి చెందిన కౌన్సిలర్లే యంత్రాంగాన్ని నిలదీశారు. 15వ వార్డు కౌన్సిలర్ సుంకర హైమావతి మాట్లాడుతూ శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉందని మండిపడ్డారు. ట్రాక్టర్లకు డీజిల్ లేకపోవడంతో ఒక్క ట్రాక్టర్ మాత్రమే తిరుగుతోందని మేనేజర్ శ్రీనివాస్ వివరణ ఇవ్వగా గత రెండు నెలల డీజిల్ బిల్లులు చూపించాలంటూ హైమావతి అధికారులను నిలదీశారు. ప్రతీనెలా 3 ట్రాక్టర్లకు రూ.60 వేల చొప్పున బిల్లులు పెట్టడంపై యంత్రాంగంపై మండిపడ్డారు. 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు మాట్లాడుతూ శివరాత్రికి వచ్చిన భక్తులకు కనీసం తాగునీరు కూడా ఏర్పాటుచేయలేదని, ఎజెండాలో ఏర్పాట్ల పేరుతో రూ.75 వేల బిల్లు పెట్టడాన్ని అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్‌లు శిడగం త్రిశేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, దోనే కిశోర్, చిన్న, కోఆప్షన్ సభ్యులు హుస్సేన్, బలరాం పాల్గొన్నారు.

'నిధుల్లేకుండా శంకుస్థాపనలా'



నిధుల్లేకుండా బీసీ కల్యాణ మండపానికి శంకుస్థాపన ఏర్పాట్లు చేయడంపై నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, నేతలు

పిఠాపురం, మార్చి 11: ఎన్నికల ముందు ఎటువంటి నిధులు, అనుమతులు లేకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు ఎంపీ వంగా గీత ప్రయత్నిస్తున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ ఎన్ వర్మ ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో బీసీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని నాయకులతో కలిసి ఆయన సోమవారం సాయంత్రం పరిశీలించి అక్కడ ధర్నా నిర్వహించారు. నిధులు లేకుండా మంగళవారం అధికార పార్టీ నేతలు శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని వారు పరిశీలించి విస్మయాన్ని వ్యక్తంచేశారు. టీడీపీ హయాంలో చేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంతో సదరు శిలాఫలకం ముక్కలను మునిసిపల్ కమిషనరు టేబుల్ మీద పడవేసి అక్కడ బైఠాయించారు. అసలు నిధులు లేకుండా శంకుస్థాపనలు ఎలా చేస్తున్నారని కమిషనరుని నిలదీశారు. గతంలో తాము నిధులు తెస్తే వాటిని వినియోగించకుండా వదిలివేసి, ఇప్పుడు అనుమతులు లేకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. అనంతరం వర్మ విలేకరులతో మాట్లాడుతూ కమ్యూనిటీ హాళ్లకు సీఎస్ఆర్ నిధులతో శంకుస్థాపనలు చేస్తున్న విషయంపై కమిషనరుని ప్రశ్నిస్తే నిధులు లేవని చెబుతున్నారని, దీన్నిబట్టే ఎంపీ ఎన్నికల జిమ్మిక్కులు చేస్తున్నారని అర్థమవుతున్నదని మండిపడ్డారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, నాయకులు పిల్లి చిన్నా, శీరం మాణిక్యం, బర్ల అప్పారావు, కొరుప్రోలు శ్రీను పాల్గొన్నారు.

'మత్స్యకారులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారమివ్వాలి'

కాకినాడ సిటీ, మార్చి 11: సముద్రతీరంలో ఓఎన్‌జీసీ చమురు నిక్షేపాల వెలికితీత సిస్మిక్ సర్వే కారణంగా నష్టపోతున్న మత్స్యకారులందరికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలని వనమాడి కొండబాబు కలెక్టర్‌ను కోరారు. దీనిపై సోమవారం అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చమురు నిక్షేపాల వెలికితీత సర్వేపై అఖిలపక్ష సమావేశాన్ని కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ విధాన గౌతమీ సమావేశహాల్‌లో నిర్వహించారు. ఓఎన్‌జీసీ ఈడీ, సీవోవో, కాకినాడ సీపోర్ట్, జిల్లా ఫిషరీస్ అధికారులు పాల్గొన్నారు. అఖిలపక్షం ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేసి వినతులు సమర్పించారు. టీడీపీ మత్స్యకార సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కోడా వెంకటరమణ, టీడీపీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ పప్పు దుర్గా రమేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రత్యేక పోలీసు బలగాల కవాతు

కాకినాడ క్రైం, మార్చి 11: ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భరోసా కల్పించేందుకు ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు కాకినాడలో కేంద్ర ప్రత్యేక పోలీసు బలగాలు సోమవారం కవాతు నిర్వహించాయి. డీఎస్పీ హనుమంతరావు నేతృత్వంలో కాకినాడ ఒకటో పట్టణ సీఐ వి.సురేష్ బాబు ఆధ్వర్యంలో సమస్యాత్మక, అతిసమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి.

హోమ్ ఓటింగ్ ప్రక్రియపై దృష్టిపెట్టండి: ఆర్వో వెంకటరావు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 11: అనారోగ్యంతో మంచానపడ్డ బాధితులు, 85ఏళ్లు దాటిన వృద్ధులు, 40శాతం పైబడి వైకల్యం కలిగిన దివ్యాంగులు హోమ్ ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఇంటి వద్దే ఓటు వేసుకునే వెసులుబాటును కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని సిటీ నియోజకవర్గ ఆర్వో, కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో తహసీల్దార్ దొర, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు సీతాపతిరావు, నాయుడు ఇతర ఎన్నికల సిబ్బందితో ఎన్నికల ప్రక్రియపై సమీక్షించారు.

పోతులూరు వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరిక

ప్రత్తిపాడు, మార్చి11: ప్రత్తిపాడు మండలం పోతులూరుకు చెందిన పలు కుటుంబాల వైసీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరాయి. పంచాది వీరబాబు, నాగులాపల్లి దొరబాబు, వీర సోమరాజు, బుల్లియ్య దేవరపు బాబురావు, పంచాది సత్తిబాబు, సూర్యభాస్కరరావు టీడీపీలోకి చేరిన వారిలో ఉన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అమరాది వెంకట్రావు, పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్ పార్టీకి రాజీనామా

ప్రత్తిపాడు, మార్చి 11: ప్రత్తిపాడు వైసీపీ మండల కన్వీనర్ పి.వీర సూర్యనారాయణ ఆ పార్టీ పదవికి, పార్టీ సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. తన అనుచరులతో త్వరలోనే టీడీపీలో చేరనున్నట్లు ఆయన ప్రకటించారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ నాగులాపల్లి బాబ్జి, మాజీ సొసైటీ డైరెక్టర్ కోలా అప్పారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

గొల్లప్రోలు, మార్చి 11: వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు పట్టణం లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైసీపీకి చెందిన మొగలి వీరబాబు, మైనం భూలోకం, తోట మణికంఠ మిత్రబృందం టీడీపీలో చేరారు. వీరిని వర్మ పార్టీ కండువాలతో ఆహ్వానించారు.

టీడీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి: సత్యప్రభ



మాట్లాడుతున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, మార్చి 11: రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్‌క్లస్టర్ స్థాయి బాధ్యులు పనిచేయాలని ఆ పార్టీ ఇన్‌చార్జ్ వరుపుల రాజా, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మెట్లరమణబాబు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయి టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సత్యప్రభ మాట్లాడుతూ ఈనెల 21న పార్టీ అధినేత చంద్రబాబు నియోజకవర్గంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. పరిశీలకుడు మెట్ల రమణబాబు మాట్లాడుతూ ప్రత్తిపాడు సీటు గెలుపు సత్యప్రభ రాజాదేనని నియోజకవర్గ క్యాడర్ అపోహలకు గురి కాకుండా రాబోయే ఎన్నికల సమయంలో కీలకంగా పనిచేయాలన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు(మీసాల రాజు), జిల్లా నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటుమళ్ల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తుని వైసీపీ నాయకుడు రత్నాజీ టీడీపీలో చేరిక

తుని రూరల్, మార్చి11: తుని చెందిన వైసీపీ కీలక నేత ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు, వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి నార్ల రత్నాజీ వైసీపీని వీడి ఆయన అనుచరవర్గంతో టీడీపీలోకి చేరారు. మాజీమంత్రి యనమల రామకృష్ణుడు స్వగృహం తేటగుంటలో పార్టీ కండువా కప్పి రత్నాజీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తుని పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తుని పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులతోపాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగసోమరాజు, పేరూరి కిషోర్, పప్పు నవీన్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, జక్కాన రామునాయుడు ఉన్నారు.

తొండంగి మండలం పెరుమళ్లపురం పంచాయతీకి చెందిన రామారావుపేట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి తునిలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

'వైసీపీ సిద్ధం సభకు లక్ష మంది కూడా రాలేదు'

కాకినాడ సిటీ, మార్చి 11: జగన్‌ది వాపే గాని.. బలుపు కాదని.. వైసీపీ సిద్ధం సభకు లక్ష మంది కూడా రాలేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 85శాతం హామీలు అమలు చేశానని జగన్ చెప్పిన మాట పచ్చి అబద్ధమన్నారు. ప్రజావిశ్వాసం కోల్పోయినందునే సభలకు జనాలు రావడం లేదన్నారు.

జగ్గంపేట, మార్చి 11: జగ్గంపేటలో ప్రజలు తన తండ్రిని గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్న నవీన్ రాష్ట్రంలో ఎన్నికల శంఖారావం మొదలైందని టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా సీటు జ్యోతుల నెహ్రూకు ఇవ్వడంతో తన తండ్రి గెలిపించడంకోసం మండలంలో పలుగ్రామాల్లో పర్యటిస్తున్నారు. తోట రవి, పైడిపాల సూరిబాబు, తోట గాంధీ, రేఖబుల్‌రాజు, మాజీ సర్పంచ్ పోట్రుకృష్ణ, బొడ్డు బుజ్జి, మీసాల సత్తిబాబు, పోట్రు రాముడు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

తాళ్లరేవు, మార్చి 11: పిల్లంక గ్రామ పంచాయతీ కొత్తలంక గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. సోమవారం వైసీపీ కార్యకర్తలకు ఆయన టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అరటికాయలంకలో వైసీపీ నాయకుడు బూసి విజయ్ ఆధ్వర్యంలో మహిళలు టీడీపీలో చేరారు.

వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే: మాజీ ఎమ్మెల్యే వర్మ సతీమణి

ఉప్పాడ(కొత్తపల్లి), మార్చి 11: రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, వచ్చే రోజులన్నీ మంచిరోజులేనని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్‌వర్మ సతీమణి లక్ష్మీదేవి తెలిపారు. ఉప్పాడ శివారు సుబ్బంపేటలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు తెలియజేకరపత్రాలను ఆమె సోమవారం మత్స్యకారులకు పంపిణీ చేశారు.

'పెరిక'ల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

టీడీపీ పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వనపర్తి బద్రి

కాకినాడ సిటీ, మార్చి 11: రాష్ట్రంలో కులవృత్తి కోల్పోయిక 'పెరిక'ల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వనపర్తి బద్రి అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పెరిక సాధికార సమితి ఆధ్వర్యాన బీ.సీ.ల భరోసా బాట.. పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్ బద్రి మాట్లాడుతూ తెలుగుదేశం-జనసేన జయహో బీసీ సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో పెరికల సంక్షేమానికి అనేక అంశాలు చేర్చారన్నారు. అధికారంలోకి రాగానే పెరిక యువతకు తక్కువ వడ్డీతో రూ 10 లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణం అందించనున్నారన్నారు. జూట్, కాగితం, క్లాత్ సంచుల తయారు చేసే చిన్న పరిశ్రమలు నెలకొల్పేందుకు చేయూత అందించనున్నారన్నారు. పెరిక విద్యార్థులకు మెరుగైన విద్యాప్రమాణాలు కల్పించేందుకు విదేశీ విద్యకు రూ.20 లక్షల వరకు ఇవ్వనున్నారన్నారు. చిన్న, సన్న కారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలుగా ఉన్న పెరికలకు వ్యవసాయ పనిముట్లు, ఇతర సామగ్రి కొనుగోలుకు సబ్సిడీ రుణం మంజూరు చేయనున్నారన్నారు. పెరిక సాధికార సమితి కాకినాడ జిల్లా కన్వీనర్ కొమిరిశెట్టి నరసింగరావు మాట్లాడుతూ టీడీపీ-జనసేన జయహో బీసీ సభలో ప్రకటించిన డిక్లరేషన్ బీసీలకు ఎంతో మేలు చేసేలా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఇరు పార్టీల అభ్యర్థుల విజయానికి విశేషంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు వనపర్తి శ్రీరామ్, కత్తిక ఫణికుమార్, లోవరాజు పాల్గొన్నారు.

వైసీపీలో రెండు వర్గాల మధ్య కొట్లాట

కోటనందూరు, మార్చి11: కోటనందూరు మండలం పాతకొట్టాం పంచాయతీ శివారులోని కేఎస్ కొత్తూరు గ్రామంలో వైసీపీలో రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామంలో ఆదివారం అడవిరాజులబాబు పండుగ సందర్భంగా బుర్రకథ వేశారు. ఈ బుర్రకథ డ్యాన్స్‌లో వైసీపీ పాటవేయగా వైసీపీలోని ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో అనిమిరెడ్డి శ్రీను, లగుడు నాగేశ్వరరావు, అనిమిరెడ్డి లోవరాజుకు వైసీపీలోని మరోవర్గమైన పైల గోపి, పైల లవరాజు, పైల కుశరాజు ఘర్షణకు దిగారు. దీంతో అనిమిరెడ్డి శ్రీను, లగుడు నాగేశ్వరరావును కోడికత్తితో దాడిచేయడంతో గాయాలయ్యాయి. ఇద్దరికీ స్థానికంగా వైద్యం చేయించగా, పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

వాహనం ఢీకొని యువకుడి మృతి

సామర్లకోట, మార్చి 11: సామర్లకోట ఓవర్‌బ్రిడ్జి దిగువన ఒక ప్రచార వాహనం ఢీకొని రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న గంగనాపల్లి గ్రామానికి చెందిన ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు తెలిసింది. సమాచారం తెలిసిన వెంటనే సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు అందాల్సి ఉందని సామర్లకోట పోలీసులు తెలిపారు.

కేబుల్ ఆపరేటర్ల పోస్టల్ రిజిస్ట్రేషన్

సామర్లకోట, మార్చి 11: సామర్లకోట ప్రధాన పోస్టాఫీసు కార్యాలయంలో సోమవారం 150మంది కేబుల్ ఆపరేటర్లకు పోస్టల్ రిజిస్ట్రేషన్ నిర్వహించారు. సామర్లకోట హెడ్ పోస్టాఫీసు పరిధిలో పలు మండలాల కేబుల్ ఆపరేటర్లు అధికసంఖ్యలో హాజరై ఈ రిజిస్ట్రేషన్ నిర్వహించుకున్నారు. ఈనెల 12న కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది.

వెటర్నరీ ఏడీగా డాక్టర్ ప్రమీల

సామర్లకోట, మార్చి 11: సామర్లకోట ప్రభుత్వ పశువైద్యశాల సహాయ సంచాలకురాలిగా డాక్టర్ ఈ.ప్రమీల బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ కాకినాడ వెటర్నరీ పాలీక్లినిక్‌లో వెటర్నరీ వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రమీల పదోన్నతిపై సహాయ సంచాలకురాలిగా సామర్లకోటకు బదిలీ అయ్యి బాధ్యతలు చేపట్టారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఏలేశ్వరం, మార్చి 11: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏలేశ్వరం ఆర్టీసీ డీఎం సత్యనారాయణ తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు 9959225532 నెంబరుకు కాల్ చేసి తెలియజేయాలన్నారు.

ఉజ్వల గ్యాస్ పంపిణీ

ఏలేశ్వరం, మార్చి 11: పట్టణంలో ప్రధాన మంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను భారత్ గ్యాస్ ఏజెన్సీవద్ద సోమవారం బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు.

'ఆదిత్య'లో వర్క్‌షాప్

గండేపల్లి, మార్చి 11: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై విద్యార్థుల అభివృద్ధి శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి ఎస్.వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎంవీ రాజేష్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో కృత్రిమ మేధపై సదస్సు

గండేపల్లి, మార్చి 11: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ-ఏఐ, ఎంఎల్ విభాగంలో రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్ సారథ్యంలో దిఆర్ట్ ఆఫ్ జనరేటివ్ ఏఐ అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్‌కి విశేష సేవలందిస్తున్న ఎల్.వెంకటశ్రీనివాస్ ఈకార్యక్రమం నిర్వహిస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, మార్చి 11: జగ్గంపేట ఎన్టీఆర్ స్మారక మందిరంవద్ద ప్రతి సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో అన్నాక్యాంటీన్ నిర్వహించారు.కిర్లంపూడి మండలం పాలేనికి చెందిన మాజీ సర్పంచ్ ఆళ్ల నూకరాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆళ్ల రవికిషోర్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఈ అన్న క్యాంటీన్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూప్రారంభించారు. మారిశెట్టి భద్రం, పాఠంశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.

బాండ్ల వివరాలు ప్రకటించాలి: సీపీఎం

కాకినాడ సిటీ, మార్చి 11: ఎస్‌బీఐ యాజమాన్యం సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించి ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ మెయిన్‌రోడ్‌లోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషబాబ్జీ, పార్టీ నగర కన్వీనర్ పలివెల వీరబాబు పాల్గొన్నారు.

దరఖాస్తులకు వేగంగా పరిష్కారం

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 11: స్పందనలో వచ్చిన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ప్రజలనుంచి 16 వినతులు రాగా సత్వరమే పరిష్కరించాలన్నారు.

ఇళ్ల పట్టాలివ్వాలని ధర్నా

కొత్తపల్లి, మార్చి 11: అరులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం(ఎంఎల్), అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘ(ఆయర్ల) ఆధ్వర్యంలో సోమవారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు గొడుగు సత్యనారాయణ,చింతపల్లి అప్పలరాజు మాట్లాడారు.

ముసాలమ్మతల్లి వార్షికోత్సవం

వేములవాడ(కరప), మార్చి 11: వేములవాడ గ్రామదేవత ముసాలమ్మతల్లి పునఃప్రతిష్టా వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. పుణ్యమంతుల అప్పారావు, సూర్యావతి దంపతులు తల్లిని అలంకరించారు. కరప గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి తరఫున ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, 200మంది మహిళలు, గరగ నృత్యాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించారు.

యనమలను కలిసిన మాజీ చైర్‌పర్సన్

తుని రూరల్, మార్చి 11: మాజీమంత్రి యనమల రామకృష్ణుడిని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట శ్రీనివాసరాజు, కుక్కడకు బాలాజీ తదితరులు ఉన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

తాళ్లరేవు, మార్చి 11: ఇంజరంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీ కార్యాలయాన్ని ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధవ్ సోమవారం ప్రారంభించారు. కార్యాలయ ఏర్పాటుకు సహకరించిన వత్తుమల్లి మురళీకృష్ణను సత్కరించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

తొండంగి, మార్చి11: శృంగవృక్షం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాకినీడి బాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, యెలిశెట్టిగిరి, ఏసుబాబు పాల్గొన్నారు.

'వసతులపై దృష్టిసారించండి'

పెద్దాపురం, మార్చి 11: ఆస్పత్రిలో వసతులపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పీహెచ్‌సీలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఆస్పత్రికి ఉన్న పరికరాలు తదితర విషయాలపై వైద్యులతో చర్చించారు.